కథానిక

# పోరు కలిగించిన మేలు

కొమ్మూరి వేణుగోపాలరావు

తన జీవితంలో మొట్టమొదటిసారిగా టిక్కెట్ లేకుండా రైల్లో ప్రయాణం చేస్తున్నాడు శ్రీనివాసరావు.

అతని చుట్టూ పెద్దమనుష్యులు. వాళ్ళంతా టిక్కెట్లు వున్నవాళ్లే అయివుంటారు. తనదగ్గర మాత్రం టిక్కెట్ లేదని ఎవ్వరనుమానించగలరు? పైకి అందరు పెద్దమనుష్యుల లాగానే తన వేష ధారణ కేం లోపం లేకపోయినా తన నిజ పరిస్థితి మాత్రం అందరికంటే హీనంగా వుంది ఇప్పుడు.

వారం రోజులయింది యిల్లు వదిలిపెట్టి. ఎవ్వరికీ తెలియకుండానే రహస్యంగా యిల్లు వదిలి పెట్టివచ్చాడు. అలా చేయటంలో తన తప్పే ముంది అసలు?

తండ్రి తనను చదవమన్నాడు. చదువంటే ఎంత యిష్టంలేకపోయినా ఆయన మాట కాదన లేక చదివాడు. మధ్యలో అప్పుడప్పుడూ దండయాత్రలు సాగించినా ఎలాగయితేనేం కాలేజీ చదువు అయిందనిపించాడు. తన జీవిత పర్యంతం కాలుమీద కాలు వేసుకుని తినగలిగినంత ఆస్తి వున్నా యింత పట్టుదలగా తండ్రి తనని ఎందుకని చదివిస్తున్నాడో అని ఆశ్చర్యం వేసేది అప్పుడు. లోకజ్ఞానం సంపాదించటంకోసమేమో అని జవాబు చెప్పుకుని సంతృప్తిపడ్డాడుకూడా. కాలేజీ చదువు ముగిసింతర్వాత అయిదు నెలల వరకూ యింట్లోకూర్చుని యిష్టంవచ్చినట్లు తిని తిరిగాడు. చివరి వరకూ తను చేయవలసిందిఅదే ననికూడా అప్పట్లో తన విశ్వాసం. కాని ఒక రోజు తన తండ్రి అన్నమాటలే కంగారు పెట్టాయి.

"ఇంట్లోకూర్చుని సోమరిపోతులా ఎన్నాళ్లు తింటావు? బి. ఏ. చదివించింది కూరోవటం కోసమే అనుకున్నావా? ఏదయినా ఉద్యోగం కోసం ప్రయత్నించు" అన్నాడాయన.

తను విస్తుపోయాడు. తను వుద్యోగం చెయ్యటమా? ఎందుకు? అంత ఆస్తి వుంచుకుని ఒకళ్ళ క్రింద అణిగివుండే వుద్యోగం చెయ్యటం ఎంత అగౌరవమైన విషయం?

"ఏమిటి? ఉద్యోగమా?" చాలా ఆశ్చర్యంగా ప్రశ్నించాడు తండ్రిని.

"అవును. లేకపోతే ఎంతకాలమని నేనుసంపాదించింది తింటూ కాలక్షేపం చేస్తావు? రేపటి నుంచీ ప్రయత్నాలు సాగించు" అన్నాడాయన.

అనవసరంగా సుఖజీవనంలో నుంచి కష్టాలులోకి కాలుపెట్టడం తనకి ఏమీ నచ్చలేదు. "ఎందుకు? మనకిప్పుడేం తక్కువయింది?" అని తిరిగి అడిగాడు తండ్రిని.

ఈసారి అయనకు కోపంవచ్చింది. "ఎందుకేమిటి? ఉద్యోగం పురుషలక్షణంరా వెధవాయి- అయినా నువ్వు చదివిన చదువును సద్వినియోగ పర్చకుండా నాశనంచేస్తావా?" అని మందలించాడు. తనింకేమీ మాట్లాడలేకపోయాడు.

మరునాటినుంచి ప్రొద్దున్న బయలుదేరి ఇష్టం వచ్చినట్లు తిరిగిరావటం, మధ్యాహ్నం యింటికి చేరి తండ్రితో ఎక్కడా ఖాళీలులేవని చెప్పటం తన దినచర్యలో జరిగే ఒక ముఖ్య విషయంగా ఏర్పరుచుకున్నాడు. మొదట్లో తనునిజంగాఉద్యోగంకోసం ప్రయత్నాలు చెయ్యటం లేదని ఆయన గ్రహించుకోలేకపోయాడు. కాని అబద్ధం ఎంత కాలం దాగుతుంది? తర్వాత ఆయనకు కూడా తెలిసిపోయింది. అప్పటినుంచి కొంచం తీవ్రంగా మందలించటం సాగించాడు. ఎవరైనా "మీ అబ్బాయి ఏం చేస్తున్నాడండీ" అని అడిగితే "బి. ఏ. ప్యాసయి యింట్లోకూర్చుని వంటనేర్చుకుంటున్నాడండీ" అని తన ఎదుటే అనటం మొదలెట్టాడు. ఎంత బద్ధకస్తుడయినా సూటి పోటి మాటలు వింటూ ఎంతకాలం ముభావంగా వూరుకోగలడు? కొంతకాలానికి తనకు నిజంగావేడి

కలిగింది. ఉద్యోగంకోసం చాలాకష్టపడి అన్వేషించటం సాగించాడు. అయితే యిదివరకెటువంటి ప్రయోజనం కలిగిందో యిప్పుడూ అంతే కలిగింది. అయినా తండ్రి తనను విశ్వసించలేదు. పైపెచ్చు మాటలుకూడా చాలా తీక్షణంగా విసరటం సాగించాడు.

వారంరోజులక్రితం రాత్రి తను పడుకోబోతున్నాడు. ఆయన మామూలుగా తనసొద మొదలు పెట్టాడు.

"నేనుమాత్రం వూరికినే కూచున్నానా?" ఉద్యోగం దొరకకపోతే నన్నేంచేయమంటావు" అన్నాడు తను కొంచెం మండి.

"గట్టిగా ప్రయత్నిస్తే ఎందుకనిదొరకదోయ్? పట్టుదలవుంటే ఏదయినా లభ్యమవుతుంది!" అన్నాడాయన అదే ధోరణిలో.

ఈసారి తనకి చాలా కోపం వచ్చింది "ఇంట్లో కూర్చుని కబుర్లు చెప్పేవాడివి నీకేం తెలుస్తుంది ప్రపంచ పరిస్థితి. నేనొక్కడినేకాదు యిలావున్నది కొన్నిలక్షలమంది"అన్నాడు తెలివి కనబరుస్తూ.

అయినా తన మాటలు ఆయనముందేమీ పని చెయ్యలేదు. "అవన్నీ నాకుతెలీని విషయాలనుకోబోకు. అయినా నేను యింతగా ఎందుకని చెప్తున్నానో తెలుసా?" అన్నాడు. తను ప్రశ్నార్థంగా చూశాడు.

"ఈ రోజుల్లో మొగవాడికి ఎన్నిలక్షణాలు వుంటే అంతకట్నం రాబట్టవచ్చు. మనకు కొంత ఆస్తివుంది. దానికితోడు నువ్వు బి. ఏ. ప్యాసయ్యావు. ఇక వుద్యోగంకూడా వుంటే ఇరవయి వేలకు తక్కువ కళ్ళచూడం" అని చెప్పాడాయన మురిసిపోతూ.

తనుమాత్రం తక్కువ తినలేదు. "ఉద్యోగం లేకపోతే పోయింది. ఒక అయిదువేలు తక్కువ వస్తే ఏం?" అని అడిగాడు. దానితో తనతండ్రి రెచ్చిపోయాడు. "ఉద్యోగం చెయ్యకుండా నీ మొహంచూడను" అన్నాడు. "అసలు నీ మొహానికి కట్నంయిచ్చే దౌర్భాగ్యుడెవ్వడు?" అని తిట్టాడు. ఇంకా చాలా అన్నాడు. ఇష్టం వచ్చినట్లు తిట్టి వెళ్ళిపోయాడు తన గదిలోంచి.

ఆ రాత్రే తన హృదయాన్ని మార్చివేసింది. తండ్రిచేత అన్నిమాటలు అనిపించుకున్నందుకు మనస్సు అపరిమితంగా ఆవేశపడింది. ఆవేశంలో తనేం చేస్తున్నాడో కూడా తెలియలేదు. ఆ రాత్రి తనకున్న బట్టలు పెట్టెలో సర్దుకున్నాడు. జేబులో ఒక అయిదురూపాయలు తప్ప మరేమీ లేవు. చేతులకి రిస్టువాచీ, ఒక ఉంగరంమాత్రం వున్నాయి. అంతకుతప్ప మరేమీ తీసుకుపోదలచలేదు కూడా. తను యిలా వెళ్ళిపోతున్నట్లు ఉద్యోగం దొరికింతర్వాతగాని మొహం చూపించకూడదని నిశ్చయించుకున్నట్లూ ఒక వుత్తరం మాత్రం తండ్రి చూసుకునేటట్లు రాసి బయలుదేరాడు.

వేలినున్న ఉంగరం అమ్మేసి వారంరోజుల్లో రెండుమూడు వూళ్ళలోదిగి ఉద్యోగంకోసం గాలించాడు. ప్రయోజనం లేకపోయింది. ఉన్న కొద్ది డబ్బుకూడా అయిపోయింది. రిస్టువాచి అమ్మటానికి మనస్సు వప్పక టిక్కెట్ లేకుండా బెజవాడకి బయలుదేరాడు. అక్కడన్నా ఏదయినా వుద్యోగం దొరకకపోదనే ఆశ మనస్సులో వుంది.

* * *

ఏదో స్టేషన్‌లో ఆగి తిరిగి బయలుదేరింది రైలు. ఒకసారి కంపార్టుమెంటునంతా కలయ చూశాడు శ్రీనివాసరావు. అతనిదృష్టికి అందరూ పెద్దమనుష్యులులాగానే గోచరించారు. తనదగ్గర టిక్కెట్ కొనటానికి డబ్బులేకపోయి ఇటువంటి పని చేశాడుగాని లేకపోతే అంత పెద్దమనిషి కానివాడా తనుమాత్రం.

ప్రక్కనున్న వారితో సంబంధంలేనట్లుగా తల వంచుకుని ఆలోచిస్తూ కూర్చున్న శ్రీనివాసం ఎందుకనో చటుక్కున తలయెత్తి చూసేసరికి త్రుళ్ళిపడ్డాడు. అతని హృదయం వేగంగా కొట్టుసాగింది. అనుకున్నంతా అయింది. అసలీ రూట్‌లో సాధారణంగా టి. సి. ల భయం వుండదు. అటువంటిది, తను ఎక్కాడు కాబట్టి యముడిలాగా తయారయ్యాడు అప్పుడే ఒకడు. ఏం చెయ్యటానికి పాలుపోలేదు శ్రీనివాసరావుకు, చేతినున్న రిస్టువాచీవంక చూస్తూ తల వంచుకుని కూర్చున్నాడు. వాడొచ్చి తనముందు ఎప్పుడు నిలబడతాడో అని భయంగానే వుంది లోపల.

"టిక్కెట్ ప్లీజ్."

రానే వచ్చాడు టిక్కెట్ ఆసామీ. పాలిపోయిన ముఖాన్ని అతి ప్రయత్నంతో పైకి ఎత్తాడు శ్రీనివాసం. ఒక్కసారిగా చకితుడయిపోయే పరిస్థితి ఏర్పడింది. తనుచూస్తున్నది టికెట్ కలెక్టరేనా? లేక అతనివేషంలో వున్న రామ్మూర్తినా? రామ్మూర్తికూడా యితనివంక నిశ్చేష్టుడై చూడసాగాడు.

ఒక నిమిషంవరకూ ఎవ్వరూ మాట్లాడ లేకపోయారు. "అబ్బ. ఎన్నాళ్ళకి చూడకలిగానురా నిన్ను! ఏమిటి? అలా మాట్లాడకుండా తెల్లబోయి చూస్తావేం? నన్ను గుర్తుపట్టలేదా?" ముందుగా రామ్మూర్తే పలకరించాడు.

"లేదురా. నిన్ను గుర్తుపట్టలేక పోవటమేమిటి? అకస్మాత్తుగా యీ స్థితిలో నిన్ను చూడగలగటమే ఆశ్చర్యంలో ముంచివేసింది" అన్నాడు తేరుకుని శ్రీనివాసరావు. మిగతా ప్రయాణీకులంతా వీళ్ళిద్దరివంకే చూడసాగారు.

"సంగతులు చెప్పవేమిట్రా ఇలా ఎక్కడిదాకా వెళ్తున్నావు? చదువు ముగించినట్లేనా?"

శ్రీనివాసం యథార్థం చెప్పలేదు పూర్తిగా, "బెజవాడ పోతున్నాను వుద్యోగం ఏదయినా దొరుకుతుందేమోనని" అన్నాడు. ఉద్యోగపు హోదాలో తన స్నేహితుడి టిక్కెట్ విషయం ప్రశ్నించడుగదా అనుకున్నాడు మనస్సులో.

రామ్మూర్తి తల పంకించాడు. "అయితే, యిప్పుడు ఎక్కడ నువ్వు వుండటం, ఈ వుద్యోగంలోచేరి ఎన్నాళ్ళయింది?" అని తిరిగి ప్రశ్నించాడు శ్రీనివాసం.

"నేను గుంటూరులో వుంటున్నానురా, రెండేళ్ళనుంచీ చేస్తున్నాను యీపని. అయితే యింకా నువ్వు వుద్యోగాన్వేషణలోనే వున్నావన్నమాట" అన్నాడు రామ్మూర్తి.

"అవునురా, ఈ సమస్య యింకా పూర్తికాలేదు."

స్నేహితుడితో మాటల్లోపడి మిగిలిన ప్రయాణీకుల టిక్కెట్లను అడగటం మరిచిపోయాడు రామ్మూర్తి. శ్రీనివాసం ఎదురుగుండా చోటు చేసుకుని కూర్చుని అతనితో సంభాషణ సాగించాడు.

రైలు మామూలు వేగంతో సాగిపోతోంది. ప్రయాణీకులంతా ఎవరిగొడవలో వాళ్లున్నారు.

"నేను గుంటూరులో దిగిపోతాను. ఇవాల్టికి నా డ్యూటీ అయిపోతుంది" అన్నాడు వెనక్కి వెళ్ళిపోతున్న చెట్లవంక కిటికీలోనుంచి చూస్తూ రామ్మూర్తి.

"నువ్వుకూడా దిగిపో. సర్దాగా నాలుగు రోజులు గడుపుదాం"తిరిగి అన్నాడు రామ్మూర్తి.

శ్రీనివాసం వులిక్కిపడ్డాడు. "నేనా? ఎందుకు? వెళ్ళిపోతాను" అన్నాడు.

"బాగానేవుంది. ఇన్నాళ్ళకుగాను కనిపించి వెళ్తానంటే ఒప్పుకుంటూ ననుకున్నా వేమిటి? అంతగా అవుతే ఆ వుద్యోగంకోసం ప్రయత్నం గుంటూరులోనే చేద్దువుగాని"

తను యిప్పుడువున్న పరిస్థితిలో ఎక్కువగా అడ్డు చెప్పలేకపోయాడు శ్రీనివాసం, "సరే. నీయిష్టం."

ఒకందుకు సంతోషంగానే వుంది రామ్మూర్తి కలిసినందుకు, నిస్సహాయంగా వున్న యీ స్థితిలో అతని సహాయంవల్ల పని నెరవేర్చుకోవచ్చు. ఎవ్వరూ ఆప్తులులేని బెజవాడకు పోయి ఏమి వెలగబెడతాడు గనుక?

"పెళ్లి పెటాకులూ పూర్తికానిచ్చావా?"

శ్రీనివాసం చిరునవ్వు నవ్వాడు. "ఇంకా లేదురా."

"అరె నాకు పెళ్ళయి ఏడాదిన్నర దాటింది. అయినా నీ వయస్సు కూడా ఏం మించిపోయిందిలే."

సంభాషణలో కాలం చకచకా గడిచిపోయింది. గుంటూరు స్టేషను కూడా వచ్చేసింది. "దిగు" అన్నాడు రామ్మూర్తి. శ్రీనివాసం దిగి తన సూట్‌కేస్ చేతిలో పట్టుకుని స్నేహితుడి వెనక నడవసాగాడు. టికెట్ కలెక్టర్‌తో పాటు వుండటం చూసి అతన్ని ఎవ్వరూ అడ్డగించలేదు, స్టేషన్‌కి రామ్మూర్తి యిల్లు దగ్గరలోనే వుండటంవల్ల యిద్దరూ నడిచే చేరుకున్నారు యింటికి.

* * *

శ్రీనివాసరావు, రామ్మూర్తి యింటికి వచ్చి వారం రోజులయింది. రామ్మూర్తి యింట్లో అతని భార్య, చెల్లెలుతప్ప మరెవరూ లేదు. రామ్మూర్తి సంపాదించేదానితో వాళ్లే లోపం లేకుండానే గడుపుతున్నారు.

శ్రీనివాసం వచ్చినదగ్గరనుంచీ రామ్మూర్తి స్నేహితుడి వుద్యోగంకోసం శాయశక్తులా ప్రయత్నించ సాగాడు. అతనికి కూడా యిక్కడే ఏదయినా ఉద్యోగం దొరికితే యిద్దరూ కలిసి ఒకే వూళ్ళో వుండవచ్చునని అతని ఆశ. శ్రీనివాసం తన విషయం యింతవరకూ రామ్మూర్తికి చెప్పలేదు. ఖర్చులకోసం వుంటాయని రిస్టువాచి కూడా డబ్బయి అయిదు రూపాయలకు అమ్మేశాడు. వాచి ఏమయిందని రామ్మూర్తి అడిగితే "పాడయిపోయింది. పెట్టెలో పెట్టేశాను" అని చెప్పాడు. శ్రీనివాసం తండ్రికి కూడా వుత్తరం రాయలేదు తను ఎక్కడ ఏ విధంగా వున్నదీ.

ఆ రోజు వుదయం ఎనిమిది గంటలయింది. రామ్మూర్తి డ్యూటీలోకి వెళ్ళిపోయాడు. శ్రీనివాసం గదిలో కూర్చుని ఏదో కథ రాసుకుంటున్నాడు. కథలు రాయటంలో అతనికి ఎక్కువ అనుభవం లేకపోయినా కాలక్షేపం కోసం రాస్తూ వుంటాడు.

తల వంచుకుని రాసుకునిపోతున్న శ్రీనివాసం బయట అడుగుల చప్పుడు విని తల యెత్తి చూశాడు. రామ్మూర్తి చెల్లెలు వసంత కొంచం తడబడుతూ లోపలికి ప్రవేశించింది. శ్రీనివాసం కొంచంగా చకితుడయ్యాడు. తను వచ్చి వారం రోజులయినా ఏ రెండు మూడుసార్లో తప్ప ఆమెతో ఎక్కువగా మాట్లాడలేదు.

"ఏం కావాలండీ?"

వసంత బెదురుతున్న కళ్ళతో అతనివంక చూస్తూ "చదువుకోవటానికి ఏమయినా పుస్తకాలుంటే తీసుకురమ్మన్నదండీ వదిన" అన్నది. శ్రీనివాసం కొంచెంగా బాధపడ్డాడు. తను యింటి వద్ద వుండేటప్పుడు కాలక్షేపానికి పుస్తకాలు, పత్రికలు ఎక్కువగా కొనేవాడు. ఇప్పుడు ముందు విషయం ఎలాగాఅని అర్థంగాక దిగులుపడుతుంటే వీటిని కొనేటందుకు డబ్బెక్కడిది. రైల్లో కాలక్షేపానికి కొనుక్కున్న పత్రికలు రెండో మూడో వున్నాయి. పెట్టెలోంచి వాటినితీసి ఆమెకిస్తూ "ఇవ్వేవున్నాయండి" అన్నాడు తన అసమర్థతకు చింతపడుతూ. ఆమె వాటిని తీసుకుని వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోయినవంకే చూస్తూ ఆలోచిస్తూ కూర్చున్నాడు శ్రీనివాసం.

స్వంత యిల్లు వదిలి అక్కడా ఇక్కడా పడి వుంటూ ఎన్నాళ్ళని కాలంగడపటం? ఉద్యోగం దొరికితేపరవాలేదు. లేకపోతే రామ్మూర్తి ఇంట్లో ఎని రోజులని వుండగలుగుతాడు? అయినా ఆవేశపడి చేతిలో డబ్బయినా లేకుంటూ అర్ధరాత్రి పూట యిల్లువదిలి బయలుదేరాడుగాని తర్వాత తను ఎన్ని కష్టాలపాలు కావలసివస్తుందో ఆలోచించుకోలేకపోయాడు. ఇప్పుడు వుద్యోగం దొరకక పోతే తను చేయవలసింది ఏమిటి? తిరిగి ఇంటికి వెళ్ళితే ఎంత అవమానం పాలు కావల్సి వస్తుంది? అంతకు ముందే తండ్రి చీటికీ మాటికీ పరిహాసిస్తూ వుండేవాడు. ఇప్పుడు ఆ యింట్లో వుండటానికి కూడా అర్హతలేకుండా పోతుంది. ఈ విధంగా ఆలోచించుకుంటూ చాలాసేపు గడిపాడు అతను. తర్వాత ఏదోనిశ్చయించుకుని పెట్టెలోంచి ఒకఅయిదు రూపాయలు తీసుకుని జేబులోవేసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

బయటకి పోయిం తర్వాత ఆలోచిస్తూ నడవ సాగాడు శ్రీనివాసం. అతనికిప్పుడో సందేహం పట్టుకుంది. తను యిక్కడ వుండటం రామ్మూర్తికి ఇష్టంగానే వుండవచ్చు. కాని అతని భార్య కూడా ఇష్టంగా ఉంటుందనే నమ్మకం ఏమిటి? అసలు తనంటే అభిమానపడాల్సిన అవసరం ఆమెకేముంది? వసంత తను వచ్చి వారం రోజులైనా ఆమె వంక పరిశీలించి చూడలేదు. కాని ఈ వేళ మాత్రం చూడటం తటస్థించింది. ఎంతపద్దనుకున్నా మనస్సులో ఆమె అందాన్ని ప్రశంసించకుండా వుండలేకపోయాడు శ్రీనివాసం. పాపం ఏదయినా పుస్తకాలుంటే యిమ్మనమని అడిగింది. వదిన అడగమంది అని చెప్పింది కాని నిజంగా వదినే అడిగిందో లేక తనంతట తను అడగటానికి భయపడి అలా చెప్పిందేమో! శ్రీనివాసం బజారుకు పోయి పుస్తకాల షాపువద్ద ఆగాడు. ఐదు రూపాయలు కొట్టువాడికిచ్చి క్రొత్తగావచ్చిన రకరకాల పత్రికలు తీసుకున్నాడు.

చేతిలో పత్రికలు పట్టుకుని యింటికి తిరిగి వచ్చాడు శ్రీనివాసం. ముందు గదిలో వసంత కూర్చుని ఏదో చదువుతున్నది. ఆమె చదువుతున్నదేమిటో గుర్తుపట్టాడు అతను. తనుఇందాక రాసిన కథ అక్కడే పెట్టి మరిచిపోయి వెళ్ళిపోయాడు. అదే యిప్పుడు వసంత చేతిలో వుంది. అతనిని చూసి సిగ్గుపడి నిల్చింది ఆమె.

శ్రీనివాసం తన చేతిలోవి ఆమె ముందు పెడుతూ, "పత్రికలు తెచ్చాను. చదువుకోండి" అన్నాడు,

వసంత చాలా ఆశ్చర్యపోయింది. "ఏమిటివి? ఇప్పుడు కొనుక్కువచ్చారా?"

"అవును. పర్వాలేదు తీసుకోండి" అని గదిలోకి వెళ్లిపోయాడు శ్రీనివాసం. తలకుమించిన ఆలోచనలు ఆలోచించుకోటానికి అతని కిప్పుడేమీ శక్తి లేకపోయింది.

ఆ సాయంత్రం రామ్మూర్తి యింటికి వచ్చిం తర్వాత సరాసరి శ్రీనివాసరావు వున్న గదిలోకి పోయాడు.

"ఇక్కడి స్టేషన్లో ఇంకోవారం రోజుల్లో ఒక ఖాళీ వస్తుంది సీనూ. నీ విషయం చెప్పాను. ఏమన్నా ప్రయోజనంవుంటే వుండవచ్చు."

"పాపం! నావిషయంలో నువ్వు చాలా శ్రమ పడుతున్నావు" అన్నాడు శ్రీనివాసరావు.

"శ్రమేముంది? ఇద్దరం ఒకచోట వుండవచ్చు ననేగా." అనేసి బట్టలు మార్చుకునేందుకు లోపలికి పోయాడు రామ్మూర్తి.

ఆ రాత్రి భోజనాలు చేస్తూండగా అడిగాడు రామ్మూర్తి, "నువ్వు కథలు రాస్తావుటగా మా యింట్లో చెప్పారు."

తనకు లేనిపోని గొప్పతనం అంటగడుతూ వుండటం చూసి శ్రీనివాసం "కాలక్షేపంకోసం కాయితంమీద నాలుగు గీతలు గీయటాన్ని కథ వ్రాటమే అని అంటే ఆ మాట వాస్తవమే" అన్నాడు.

రామ్మూర్తి ఏమీ మాట్లాడలేదు.

* * *

రోజులు గడుస్తున్న కొద్దీ శ్రీనివాసరావుతో వసంత చనువుగా ప్రవర్తించ సాగింది. శ్రీనివాసరావు కూడా తనకు తెలియకుండానే ఆమె హృదయానికి సన్నిహితుడవుతూ వచ్చాడు.

వసంతతో సాంగత్యమే అతని పరిస్థితుల్ని ఎటూ వీలుగాకుండా చేసింది.

"రోజురోజుకూ ఆమెకు దగ్గరయిపోతున్నా. ఇది విధాయకమైన పనేనా?" అనుకున్నాడు. రామ్మూర్తి ఆప్తమిత్రుడు, అతనికి ద్రోహం చేస్తున్నానా? అనిపించింది ఒకమారు. ఎందుకని ద్రోహం కాదు? స్నేహితుడి చెల్లెల్ని యీ విధమైన దృష్టితో చూడటం ఏమయినా మంచి పనేనా? కాని అతను మళ్ళీ సమాధానం చెప్పుకున్నారు. తనలో దురుద్దేశ్యం లేదు. ఆమెను ప్రేమిస్తున్నాడు. తనామెను ప్రేమిస్తున్నాడా? అంటే! తనకు ప్రేమంటే ఏమిటో సరిగా తెలియదు. ఆమెమీద కలిగిన మమకారాన్ని ప్రేమ అనే రూపంలోకి తీసుకువస్తున్నాడు. పోనీ ఏదయితేనేం? తను ప్రేమ అనుకున్నదానికి అర్థం ఏమయివుంటేనేం? కాని తన ప్రేమకు పర్యవసానం వివాహమేగా! వసంతను తను పెళ్ళి చేసుకోవాలి.

ఈ నిశ్చయంలోకి వచ్చిన తర్వాత అతని హృదయం కొంచం తేలికపడ్డది. అయితే ఇంకో సందేహం పట్టుకుంది. ఈ పెళ్ళికి పునాది యే విధంగా వేయాలి? రామ్మూర్తికి యీ విషయం చెపితే మనస్సులో నొచ్చుకోడు కదా! ఎందుకని నొచ్చుకుంటాడు? తను ఏమీ అన్యాయం చెయ్యటము లేదు. లోకసమ్మతమైన వివాహాన్నే వాంఛించాడు. ఇందులో తప్పేముంది గనక?

కాని తనకి ఒక్కటే భయంగావుంది. ఈ వూహాలన్నీ తనంతట తను పెంచుకుంటున్నవేనా? లేక వసంతకూడా తనతో సహకరిస్తుందా? అదే అనుమానం. ఈ విషయంలో ఆమె అభిప్రాయం తెలుసుకోవటం ముఖ్యం. తను ఎంత పిరికివాడో తనకు తెలుసు. ఒక పరాయి స్త్రీని యీ విషయం ముఖాముఖిగా అడగలేడు. మరి ఏమిటి చెయ్యటం?

ఒకరోజు యీ విధంగా ఆలోచించుకుని కాగితం, కలం తీసి రాయసాగాడు.

"నేను ఈ వుత్తరం రాయటంలో ఏమన్నా సాహసం చేశాననుకుంటే క్షమిస్తావని నమ్ముతాను. మన పరిచయాన్ని ప్రేమగానే అర్థం చేసుకున్నాను. ఈ విషయంలో నీ సమ్మతం రాస్తే చాలా సంతోషం. నేను వేరేవుద్దేశంతో రాయటంల్లేదు. నీకిష్టమయితే మీ అన్నయ్యను ఒప్పించి నిన్ను వివాహం చేసుకునేందుకు సిద్ధం. జవాబుకోసం ఎదురుచూస్తూ వుంటాను."

క్రింద తన సంతకం పెట్టాడు. దీనిని ఆమెకెలాగ అందించటమనే సందేహంగా వుంది. అంతలోనే బయట అడుగుల చప్పుడు వినిపిం

-చింది. తలఎత్తిచూసేసరికి వసంత లోపలికివచ్చింది చటుక్కున చేతిలోని కాకితాన్ని తను అంతకు ముందు కొనుక్కొనివచ్చిన పత్రికలో పెట్టేశాడు.

"ఈ రోజు మిమ్మల్నొక విషయం అడగాలనుకుంటున్నాను"

శ్రీనివాసం ఉలుక్కుపడ్డాడు. తనకు ఎదురయిన ప్రశ్నే ఆమెకూ కాలేదుగదా.

"ఏమిటి?"

"మీరు యిన్ని కథలు రాస్తున్నారు. అవన్నీ పెట్టెలో పెట్టి పూజించటానికే. ఏ పత్రికకయినాపంపి ఎందుకు పేరుసంపాదించకూడదు?"

తన కథలంటే తనకు లేనివిలువ ఆమెకెందుకో అర్థంకాలేదు, "వాటిల్లో ఏమీ చైతన్యం వున్నదనుకోను. అవి పత్రికలకు పంపించాలనీ, పేరు గడిద్దామని సంస్కరణ భావాలు పెటుకుని ఏమీ రాసినవికావు. అయినా వాటిని ఎవరన్నా ప్రచురిస్తారనికూడా నేననుకోను"అన్నాడు శ్రీనివాసం.

వసంతకు యితని మాటలేవీ సత్యసమ్మతంగా వున్నట్లు కనబడలేదు.

"అసలు ప్రయత్నం ఎందుకని చెయ్యకూడదు? మీకు వాటిమీద అంత నిర్లక్ష్యంగా వున్నదికాని పత్రికలలో మనం చదువుతున్న రచనలకంటే మీ రచనలు ఏమీ తీసిపోయినట్లు లేదు"అన్నది.

"కాని నువ్వీవిషయం ఎందుకని యింత పట్టుబడుతున్నావో అర్థంకావటంలేదు."

"అలా అడిగితే ఏమని చెప్పేది? ఒకరికున్న ప్రజ్ఞను అభివృద్ధిలోకి తీసుకురాకుండా, బూజు పట్టేటట్లు చేయటం ఏం బాగుంది?"

వసంత మనస్సుకు కష్టం కలుజేయటం ఇష్టం లేదు శ్రీనివాసరావుకు. "సరే అయితే ప్రయత్నిస్తాను"అన్నాడు.

"మీ చేతిలోది ఏం పుస్తకం?"

"ఇంతకుముందే కొనితెచ్చాను దీన్ని. చదువుకో"అని తన చేతిలోనిపత్రికను ఆమె చేతిలో ధైర్యంగా పెట్టివేశాడు. గుండె వడిగా కొట్టుకుంది. "నేను బయటకు పోయి వస్తాను" అని రివ్వున వెళ్ళిపోయాడు బయటకి. తనముందే ఆ పత్రిక ఎక్కడ తెరుస్తుందోనని భయం.

"అయినా ఆమె అంగీకరిస్తుందో అంగీకరించదో. ఆమె మాట్లాడేమాటల్ని బట్టి మనస్సులో ఏ భావం వున్నదీ కనుక్కోవటం కష్టం"అనుకున్నాడు దారిలో.

కాని శ్రీనివాసరావు భయపడినట్లుగా జరగలేదు. ఆ సాయంత్రమే అదే పత్రికద్వారా తన ఉత్తరానికి జవాబు వచ్చింది.

"ఇన్నాళ్ళనుంచీ మీ హృదయం తెలియక బాధ పడుతున్నాను. నిజంగా చెప్పాలంటే మిమ్మల్ని చూసిన ప్రథమ పర్యాయమే నా మనస్సు అదోలా అయింది. కాని...మన ప్రేమ ఫలిస్తుందా? అన్నయ్యను అడగండి. ఆయన చెప్పినదానినే ఆచరణలోకి తీసుకువద్దాం" అని వుంది అందులో.

శ్రీనివాసం కొంచంగా వింతపడ్డాడు. "మన ప్రేమ ఫలిస్తుందా?" అని రాసింది. రామ్మూర్తి అంత అర్థం చేసుకోలేని మూర్ఖుడా? అయినా తప్పేముంది యిందులో. తను అడిగితే అతనెందుకని నిరాకరిస్తాడు? కాని కొంతకాలం ఆగాలి. తనకు వుద్యోగం లభించాలి. ఈలోగా తన కోరిక వెల్లడిస్తే బాగుండదు. ఈ విషయంలో తనకేమీ భయంలేదుగాని తన తండ్రితోనే వస్తుంది పేచీ. ఆయన కట్నానికి ఆశపడేగా వుద్యోగం చెయ్యమని ప్రోత్సహించింది. అయినా తను ఆయనకి లోబడిపోకూడదు. సాధ్యమయినంతవరకూ ఒప్పించటానికి ప్రయత్నం చెయ్యాలి. ప్రయోజనవుంటే సరేసరి. లేకపోతే యెదిరించటం తథ్యం.

వసంతను పెళ్ళిచేసుకునే విషయంలో యీ నిశ్చయానికి వచ్చాడు. శ్రీనివాసరావు అతని మనస్సు యిప్పుడు కొంచం తేలికపడింది.

కాని యీ వుద్యోగం విషయమే తనకో సమస్యగా పట్టుకుంది. తనకి ఎలాగయినా స్టేషనులో ఉద్యోగం యిప్పించాలని రామ్మూర్తి చాలా శ్రమపడుతున్నాడు. నిన్న తను కూడా పోయివచ్చాడు. వ్యవహారం చూస్తే సానుకూలపడేటట్లే వున్నది. ఇది తప్పితేమాత్రం తనకి యిప్పట్లో వుద్యోగం దొరకటం అనేది అబద్ధం. తనుమాత్రం ఎన్నాళ్ళకి ఇక్కడకూర్చుని తింటాడు?"

వ్యాకులపడే మనస్సును సముదాయించుకోవటం ఎలాగో తెలియక సిగరెట్ తీసి ముట్టిం

చాడు శ్రీనివాసం. అతనిదగ్గర డబ్బు కూడా నిండుకొంటున్నది.

మరో అరగంట గడిచేటప్పటికి రామ్మూర్తి వచ్చాడు యింటికి అతని వదనంలో చిరునవ్వు తాండవిస్తున్నది. వస్తూనే స్నేహితుడితో "మంచి శుభవార్త. నీ వుద్యోగం సంగతి ఖాయమయిపోయింది" అన్నాడు.

శ్రీనివాసరావు ఆనందంతో వుక్కిరిబిక్కిరి అయ్యాడు. "ఏమిటి? నిజంగా?"

"అవును. రేపువచ్చే ఫస్టుకే నువ్వు జాయిన్ కావాలి."

స్నేహితుణ్ణి కౌగలించుకోవా లనిపించింది శ్రీనివాసానికి. ఎంత వుదార హృదయంకలవాడు కాకపోతే తనకీ వుపకారం చేస్తాడు.

"నీ వుపకారం మరిచిపోలేనుమూర్తీ. నిన్నెలా అభినందించకుండా వుండాలో తెలియకుండా వుంది."

రామ్మూర్తి స్నేహితుడి ముఖంలోకి చూస్తు అదో విధంగా నవ్వాడు. ఆ నవ్వులో యేదో ఆశ ప్రతిఫలించింది. శ్రీనివాసరావు మౌనం వహించాడు.

* * *

మరునాడు సాయంత్రం రామ్మూర్తి, శ్రీనివాసరావు గాంధీ పార్కుకు షికారు వెళ్ళారు.

తన మనస్సులోని మాట ఎప్పుడు చెపుదామా? అని ఆరాటంగా వున్నది శ్రీనివాసరావుకి. తన స్నేహితుడు రామ్మూర్తి—అతనితో ఈ విషయం ఏ విధంగా చెప్పటం? అతని మనస్సు కేమయినా కష్టం కలుగుతుందేమో, అసలా ప్రస్తావన తీసుకు వచ్చేందుకు నాంది ఏదో తెలియకుండా వుండాయె.

"ఏమిటి? ఆలోచిస్తున్నావు."

శ్రీనివాసరావు వులుక్కిపడ్డాడు. ఎలా అయినా సరే తను చెప్పేసేయాలి.

"రామ్మూర్తీ" అన్నాడు తను.

రామ్మూర్తి ప్రశ్నార్థంగా చూశాడు.

"నీకో విషయం చెపితే ఏమీ అనుకోవుగదా" మాట్లాడుతుంటే కంఠం అపస్వరాలు పలికింది.

"ఏమిటి?"

శ్రీనివాసరావు అతి కష్టంమీద తలయెత్తి స్నేహితుడి ముఖంలోకి చూశాడు. అతనికళ్ళు భయంతో బెదురుతున్నాయి. నువ్వు మనస్సుకు కష్టం పెట్టుకోవద్దు మూర్తీ, నా వుద్దేశం మాత్రమే చెప్తున్నాను. ఏమిటి అంటే మీ చెల్లెలు వ...సం...త...నే...ను" తనలోని సర్వశక్తులూకూడ బెట్టుకుని యీమాట అన్నాడు గాని అటుపైని గొంతు పెగల్లేదు.

రామ్మూర్తి కళ్ళలో అదోవిధమైన నూతన కాంతి ప్రజ్వలించింది. "నాముందు ఏమాట చెప్పటానికయినా సంకోచించవద్దు" అన్నాడు.

శ్రీనివాసరావు మరోమారు గట్టిగా ప్రయత్నంచేయగా రెండేరెండు అక్షరాలు నోటినుంచి బయటకు వచ్చినాయి."

"పె...ళ్ళి"

ఆ తర్వాత అతనితల భూమిలోకి దించుకుపోయింది. రామ్మూర్తి కళ్ళలో ప్రజ్వలించిన కాంతికి యిప్పుడు వింతతేజస్సు వచ్చి మెరుగు పెట్టింది.

"ఈ విషయం నాతో చెప్పటానికి యింత సందేహిస్తావనుకోలేదు. నీమాట నేను కాదంటానా?" అన్నాడు.

శ్రీనివాసరావు సిగ్గుపడి సమాధానంచెప్పలేదు.

"నువ్వన్నదానికి నేనెప్పుడూ కాదననుకో. కాని వసంతనుకూడా కనుక్కొని ఆమె అభిప్రాయంకూడాతీసుకుంటే మంచిది"అన్నాడు తిరిగి రామ్మూర్తి.

శ్రీనివాసం తలఎత్తి "నేను ఆమె అభిప్రాయం తీసుకోకుండా నిన్ను ప్రశ్నించలేదు. ఆమె 'అంగీకరించింది'' అన్నాడు.

"అయితే నాయిష్టా అయిష్టాల ప్రమేయం యింకేముంది? వసంతచెప్పిన వివరాలన్నీ విన్నావుగా"

శ్రీనివాసరావు కొంచెంగా తెల్లబోయాడు. వివరాలేమున్నాయి యింక?" అని అడిగాడు.

రామ్మూర్తికూడా తెల్లబోయాడు. "ఐతే వసంత అన్ని సంగతులూ నీకు చెప్పెయ్యలేదా?" అన్నాడు.

"నువ్వు మాట్లాడేది అర్థం కావటంలేదు. నన్ను కలవరపెట్టక అసలు విషయమేమిటో చప్పున చెప్పు."

రామ్మూర్తి కొంచెం తటపటాయించాడు. తన నోటినుండీ మాట బైటికిరావటానికి చిన్న

ప్రయత్నంచేసి "చెప్పమంటావా నీనూ. ఇంత కాలం నీముందు దాచివుంచింది చెప్పేస్తున్నాను మా వసంతకి చాలా సంవత్సరాలక్రితమే పెళ్ళయి పోయింది" అన్నాడు.

శ్రీనివాసం దెబ్బతిన్న లేడిలాగా బెదిరి పోయాడు. తను వింటున్నది ఏమిటి? వసంత వివాహం జరిగిపోయిందా? తన కావిషయం ఎందుకని తెలియబరచలేదు? మరి ఆ ఉత్తరం అలా రాసిందేమిటి?

ఏమీ మాట్లాడటానికి తోచక రామ్మూర్తి ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు.

"కాని చాలాకాలంక్రిందటనే ఆమెభర్త చనిపోయాడు. ఆ వసంత యిప్పుడు వితంతువు. లోకానికి లోబడి ఆమెను వితంతువుగా అందరు తెలుసుకునేటట్లు అలంకరింపలేకపోయాను. అందుచేతనే నువ్వు గ్రహించలేకపోయావు" రామ్మూర్తి కళ్లు అశ్రుపూరితాలయ్యాయి.

శ్రీనివాసరావు హృదయం భయంతో నిండిపోయింది. వసంత వితంతువా? తనా సంగతి తెలియక యెంత పొరపాటుచేశాడు! ఆ విషయం మొదటనే తెలిస్తే యింతదూరం వచ్చేది కాదు. తనిప్పుడు ఏంచేయాలి? తన నోటిమీదిగా తనే అడిగాడు ఆమెను పెళ్ళి చేసుకుంటానని. ఇపుడు కాదంటే రామ్మూర్తి మనస్సు ఎంత గాయపడుతుంది? తన తండ్రి ఎంత పూర్వాచార పరాయణుడో తనకు తెలుసు. ఆయన ప్రాణంపోయినా సరే యిటువంటి వివాహానికి సుతరామూ ఒప్పుకోడు. అసలు తనని ఉద్యోగం యెందుకు చేయమన్నాడు? కట్నానికి ఆశించేగా. అటువంటప్పుడు తను యిలా చేస్తే ఆయన మండిపడి ఎంత పనయినా చెయ్యడానికి వేరే అడ్డంకు ఏముంది?

రామ్మూర్తి ముఖంలోకి సూటిగా చూశాడు శ్రీనివాసం. హృదయంలోంచి వాత్సల్యం పెల్లుబికింది. ఎంత అమాయకంగా కనిపిస్తున్నాడు! తను ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం లభించిందా? అతని సహాయం వల్లనేగా దొరికింది. అతన్ని యిప్పుడు ఎలా ద్రోహం చేయగలడు? అలాచేస్తే తిరిగి అతని ముఖాన్ని చూడటానికి తన మనసు సిగ్గుతో కుమిలిపోదూ? అయినా యీ రోజుల్లో ఎంతమంది యిలాంటి వివాహాలు చేసుకుంటున్నారు? వారిని లోకం ఏంచేయగలుగుతుంది? తను చదువుకుని కూడా యీ విషయంలో తన ఆప్త స్నేహితుడికి సహాయం చెయ్యటానికి యింత వెనకాడటమా?

ఇలా ఆలోచించుకుని శ్రీనివాసం స్నేహితుడితో తన అంగీకారం చెప్పివేద్దామనే నిశ్చయంలోకి వచ్చాడు. అతని హృదయంలో రేగిన తుఫాను తెలిసిపోయి తిరిగి ప్రశాంతంగా మారింది.

రామ్మూర్తి యిందాకటినుంచి ఆలోచిస్తున్న స్నేహితుడివంక చూస్తూ మౌనంగా వుండిపోయాడు. కాని శ్రీనివాసం చాలాసేపటివరకూ మాట్లాడకపోవటం చూసి "నీకు యీ విషయం తెలియనియ్యకుండా దాచగలిగే శక్తి వున్నా మోసం చెయ్యటం యిష్టంలేక యదార్థ విషయం చెప్పేశాను. నీ అభిప్రాయం చెప్పేటందుకు భయపడవద్దు నీనూ" అన్నాడు.

"నేనేం భయపడలేదు మూర్తీ" శ్రీనివాసం అన్నాడు. "నువ్వు చేసిన వుపకారం నా ఆజన్మాంతం మరిచిపోరానిది. నీకు కృతజ్ఞత చూపిస్తాను. వసంతను పెళ్లిచేసుకోటానికి నాకు అంగీకారమే."

రామ్మూర్తి ఆనందం పట్టలేక స్నేహితుడి చేతుల్ని గట్టిగా పట్టుకుని "నీది చాలా విశాల హృదయం నీనూ" అని పొగిడాడు. ఏమి అనాలో తెలియలేదు శ్రీనివాసరావుకు.

రామ్మూర్తి తనను ఎలా మోసంచెయ్యలేదో తన తండ్రినికూడా అలాగే మోసపుచ్చ దలచలేదు శ్రీనివాసం. యదార్థ విషయం చెప్పెయ్యటానికి ఏమాత్రం సందేహించలేదు.

ఆ మరునాడే తను వూరికి చేరినది మొదలు నిన్నటి నిశ్చయంవరకూ నీ వివరంగా తండ్రికి వుత్తరంరాసి, తన ఎడ్రసుకూడా తెలియబరచి దాన్ని పోస్టుచేశాడు శ్రీనివాసం.

* * *

తన వుత్తరం అందగానే తన తండ్రి బయలుదేరి వస్తాడని అనుకున్నాడు శ్రీనివాసం రావు. అలానే జరిగిందికూడా. రెండోరోజుకల్లా రామ్మూర్తి యింటికి ఆయన వూడిపడ్డాడు.

ఆయన వచ్చేవరకి రామ్మూర్తి యింట్లోలేడు. శ్రీనివాసంమాత్రం ఏదో చదువుకుంటూ కూర్చుని

వున్నాడు. అతన్ని చూడంగానే తండ్రికి కోపం పెల్లుబికింది.

"ఇంతకాలం చదువు అఘోరించి యిప్పుడు నువ్వు చేసేపని యిదిట్రా. ఇందుకోసమేనా నిన్ను వుద్యోగం చెయ్యమన్నాను" అని గట్టిగా అరిచాడు.

శ్రీనివాసరావు చలించలేదు. తండ్రివంక నిశ్చలంగా చూస్తూ "వస్తూనే అంత కోపపడతావేం నాన్నా. కొంచం శాంతించు, ముందు ప్రయాణ బడలిక తీర్చుకో. తర్వాత మాట్లాడుకోవచ్చు" అన్నాడు.

ఆయన మండిపడుతూనే అక్కడున్న కుర్చీలో కూర్చుని "నేను విశ్రాంతి తీసుకునేందుకు కాదు వస్త. ఏవిషయమూ తేల్చుకుని పోయేందుకు. అయినా విధవదాన్ని పెళ్ళి చేసుకుంటావురా నువ్వు? మన వంశగౌరవం ఎలాంటిది? దాన్ని మంట గలుపుతావా?" అన్నాడు.

"కోపపడవద్దు నాన్నా. నేను తప్పేమీ చేయటం లేదనుకుంటూను. రామ్మూర్తి నాకు చేసిన సహాయానికి ఫలితంగా యీపని చేయటానికి ఒప్పుకున్నాను. ఐనా నువ్వేగా వుద్యోగం చెయ్యమని నాదుంప తెంచింది" అన్నాడు శ్రీనివాసం.

"ఉద్యోగం చెయ్యమన్నానుగదా అని యింత పని చేస్తావా? అయితే నువ్వు ఏమీచెయ్య నక్కర్లేదు. ఇంట్లో కూచుందువుగాని నావెంట వచ్చెయ్యి."

"నువ్వు యీ పెళ్ళికి ఒప్పుకుంటేనే నేను వచ్చేది. లేకపోతే యిక్కడే వుండిపోతాను."

"ఏమిట్రీ!" శ్రీనివాసం తండ్రి ఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేశాడు. "ఇక్కడే వుండిపోతావన్న మాట నీయిష్టం వచ్చినట్లు అఘోరించు, కాని అయితే నా ఆస్తిలో నీకు దమ్మిడీరాదు. అంతా నాస్వార్జితం అని తెలుసుగా"

శ్రీనివాసరావు తండ్రివంక చూస్తూ "అన్నీ తెలుసు. ఆస్తికోసం నేనేమీ ఆశపడటంలేదు. అందుచేత నీ మనస్సుమార్చుకుని నాతో మంచిగా వుండటమే సరియైనపనిఅనుకుంటాను" అన్నాడు.

"నాకటువంటి అవసరమేం పట్టలేదు. నువ్వు లేకుంటే బ్రతకలేననుకుంటున్నావా? ఈ ఇంట్లో యిక నేను క్షణం వుండను"అని ఆయన లేచి నిలబడి వెళ్ళిపోవటానికి వుద్యుక్తుడయాడు.

"అయితే కోడల్ని చూసిపోవా?"

శ్రీనివాసరావు తండ్రి యీ మాటలు విని కొడుకు వంక ఒకసారి కోపంగాచూసి పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు. "ఇక జన్మలో నీమొహం చూడను"అన్న మాటలు మట్టుకు ఆఖరి సారిగా ఆయన నోటినుండి వెలువడినయ్.

శ్రీనివాసరావు కొంచంగా విచారించాడు. కాని "ఆయనేగా నన్ను ఉద్యోగం చేయమని పీడిస్త. అందుకనే యిలాగయింది. ముసలివాడయిన ఆయనకే అంత పట్టుదల వుంటే నాకెంత వుండాలి"అనుకుని సంతృప్తి పడ్డాడు.

ఆ సాయంత్రం రామ్మూర్తి యింటికి వచ్చిం తర్వాత విషయమంతా అతనికి చెప్పి, "అయిపోయిన దానికి నేనేమీ విచారించటం లేదు. త్వరలోనే ముహూర్తం, నిర్ణయింప బడేటట్లు చూడు"అన్నాడు.


# తెలుగులో
# కథానికల పోటీ

రచనలు పంపవలసిన తుది తేదీ—అక్టోబరు 10.

కథానిక రెండువేల పదములకు మించి వుండరాదు.

రచనలను ఈ ప్రక్క విలాసానికి పంపవలె:— పబ్లికేషన్స్ సెక్షన్,
పౌర సంబంధ సమాచారశాఖ,
హైదరాబాదు—దక్కన్.